క్లుప్తంగా

పెరటితోటల పెంపకంపై మహిళలకు శిక్షణ



మహిళలకు విత్తనాలు అందజేస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది

కిర్లంపూడి: పెరటి తోటల పెంపకంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని ఏపీసీఎస్ఎఫ్ యూనిట్ ఇంచార్జి బి.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ముక్కొల్లు, రామకృష్ణాపురం గ్రామాల్లో జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్గానిక్ పంటలపై మహిళలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమతుల్య పోషకాహారం తీసుకోవడం వల్ల శరీరానికి కావలసిన పోషకాలు, ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయన్నారు. ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా మహిళలు పెరట్లోనే ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవాలని సూచించారు. అనంతరం 70 మంది మహిళలకు 11 రకాల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బర్రే నాగేశ్వరరావు, వీపీఏ రమ్య, యు.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డయాబెటిక్ కేర్ వార్షికోత్సవం

తుని: స్థానిక నారాయణరాజు వీధిలోని నరసింహ డయాబెటిక్ కేర్ ఆసుపత్రి 12వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తొలుత ఆసుపత్రి సిబ్బంది కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తుని పరిసర ప్రాంతాలకు చెందిన 106 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యురాలు చిత్రారెడ్డి, వెంకటరెడ్డి తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు.

రేపు ఉపాధి గ్రామ సభలు

తుని రూరల్: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపు, ఆమోదానికి ఈ నెల 23న అన్ని గ్రామాల్లోనూ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం తెలిపారు. గ్రామ సభలు నిర్వహించేందుకు ప్రభుత్వం మండల స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లగాను, సర్పంచులను చైర్మన్లగాను, పంచాయతీ కార్యదర్శులను కన్వీనర్లగా నియమించిందన్నారు. డి.పోలవరం, ఎస్.అన్నవరం, తాళ్లూరు, వి.కొత్తూరులో ఉదయం పది గంటలకు గ్రామ సభలు ప్రారంభమవుతాయన్నారు. వల్లూరు, తేటగుంట, టి.తిమ్మాపురం, రాపాక, ఎన్.సూరవరం, లోవ కొత్తూరు, కొలిమేరు, కేఓ మల్లవరం, ఎన్.చామవరం, చేపూరు గ్రామాల్లో ఉదయం 11 గంటలకు గ్రామ సభలు ఏర్పాటు చేశామన్నారు. ఎ.అగ్రహారం, అటికివానిపాలెం, డొండవాక, హె.కొత్తూరు, హంసవరం, కుమ్మరిలోవ, ఎస్ఎస్వీ నగరం, రాజుపేట, రేఖవానిపాలెం గ్రామాల్లో మధ్యాహ్నం రెండు గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రైతులు, రైతు కూలీలు, ఉపాధి కూలీలు పాల్గొని కొత్తగా చేపట్టాల్సిన పనులను సూచించవచ్చన్నారు. ఆయా పనులపై గ్రామ పంచయతీలు వద్ద జరిగే గ్రామ సభల్లో చర్చించి, ఆమోదం తెలపాల్సి ఉందని ఎంపీడీఓ రవికుమార్ వివరించారు.

భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగానే పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్‌శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. విద్యుత్ సమస్యలపై 'వానల్లోనూ కోతలు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బుధవారం ఆయన స్పందించారు. గోకవరం మండలం ఏజెన్సీ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. అలాగే వాతావరణంలో మార్పుల కారణంగా ఎయిర్ కండీషనర్ల లోడు పెరిగి కొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లోడు పెరిగి రెండు సెక్షన్ ఫీజులు పోయాయన్నారు. వీటి వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, అయితే వెంటనే సిబ్బందితో వాటిని మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు తెలిపారు. మండలంలో ఎటువంటి అప్రకటిత విద్యుత్ కోతలు లేవని ఆయన తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

కరప: మండలంలో జరిగిన వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ ఒకరు, పాము కరచి మరొకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరప మండలం పెద కొత్తూరు గ్రామానికి చెందిన దాసరి భీమరాజు (28) బుల్‌డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. భీమరాజు ఈనెల 19న పనిమీద మోటార్‌సైకిల్‌పై ఉప్పాడ వెళ్లి, తిరిగి వస్తుండగా వాకాడ వంతెన వద్ద బైక్ స్కిడ్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను జీజీహెచ్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే గురజనాపల్లి గ్రామానికి చెందిన మరుకుర్తి సత్తిబాబు (40) రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తుంటాడు. బుధవారం మధ్యాహ్నం అక్కడ కాపలా కాస్తుండగా అతన్ని విషసర్పం కుట్టడంతో అపస్మారక స్థితికి చేరి అక్కడే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ కరప పోలీసు స్టేషన్ వద్ద కొద్దిసేపు ఆందోళనకు దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

శిక్షణ.. దిగుబడికి రక్షణ

- గ్రామాల్లో జోరుగా పొలంబడి కార్యక్రమాలు
- రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



కాకరాపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర్

తుని రూరల్: రైతులు సామూహికంగా ఎలుకలు నివారణ చర్యలు చేపడితే పంటలకు రక్షణ కలుగుతుందని జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ భ్రమరాంబ అన్నారు. మండలంలోని డి.పోలవరంలో వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ వరి సాగులో ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వేర్వేరుగా ఎలుకల నివారణా చర్యలు చేపట్టడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. దీంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. రైతులందరూ ఒకేసారి సామూహికంగా ఎరలను ఏర్పాటు చేసి ఎలుకలను నివారించాలని సూచించారు. విషపు ఎర తయారీ, ఎరను బొరియాల్లో ఏర్పాటు చేయాలో తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరంచారు. కార్యక్రమంలో ఏఈఓ పొలమరశెట్టి జగ్గ అప్పారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: గ్రామంలోని వరి క్షేత్రాలను బుధవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. మార్టేరు వరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు భువనేశ్వరి, సునీత, రోజా, పెద్దాపురం డాట్ సెంటర్ శాస్త్రవేత్త శర్మ, జగ్గంపేట వ్యవసాయ శాఖ ఏడీ యింటి వీర గంగాధర్ గ్రామంలోని వరి క్షేత్రాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి చేలల్లో కలుపు, నీటి సమస్య అధికంగా ఉన్నట్టు గుర్తించారు. కలుపు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వారి వెంట వ్యవసాయశాఖ సహాయకులు అర్జున్, మణికంఠ, వరహాలబాబు తదితరులు ఉన్నారు.

నారు సుతలు తుంచి నాట్లు వేయాలి

కోటనందూరు: నారు సుతలు తుంచి నాట్లు వేయడం ద్వారా తెగుళ్ల ఉధృతిని తగ్గించి మంచి దిగుబడులు సాధివచ్చని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కాకరాపల్లిలో బుధవారం రైతులు, వ్యవసాయశాఖ సిబ్బందికి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సాధారణ ఉడుపు కన్నా బెంగాల్ ఉడుపుతో తక్కువ విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం సేంద్రీయ విధానంలో ద్రవ జీవామృతం తయారు చేయు విధానాన్ని ప్రయోగాత్మంగా వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

వరిపొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెంలో వరి పొలాలను మార్టేరు ప్రాంతీయ పరిశోధన కేంద్రం, పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. వరి పంటను బ్యాక్టీరియా, ఎండు ఆకు తెగులు ఆశించినట్టు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భువనేశ్వరి, సీతారామశర్మ, రోజా, మండల వ్యవసాయాధికారి సద్గురు మూర్తి, గ్రామ సర్పంచ్ పోకల సుబ్బారావు పాల్గొన్నారు.

సిరిపురంలో పొలంబడి

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయధికారి బి.జ్యోతి రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పొలాల్లో ఎలుకలు ఎక్కువగా ఉన్నందున సజీవ బొరియలను గుర్తించాలన్నారు. ఒక హెక్టార్ పొలంలో 50 బొరియలు ఉంటే బ్రోమోడయోలిన్ వాడాలన్నారు. రైతులు సామూహిక ఎలుకలు నివారణ చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సిరిపురంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ జ్యోతి



డి.పోలవరంలో సామూహిక ఎలుకలు నివారణ చర్యల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీఏ, ఏఓ, రైతులు

పత్తిలో తెగుళ్ల నివారణతో లాభాలు



చేపూరులో పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తుని రూరల్: పత్తి పంటకు సోకే తెగుళ్లను నివారించడం ద్వారా దిగుబడి పెరిగి లాభాలు వస్తాయని కాకినాడ జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఏఎస్ఆర్ శర్మ, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ రోజా, డాక్టర్ సునీత అన్నారు. బుధవారం తుని మండలం చేపూరులో పర్యటించిన శాస్త్రవేత్తలు రైతులతో కలసి పత్తి పంటలను పరిశీలించారు. పిండి నల్లి (తెల్ల బూజు) తెగులు, గులాబీ రంగు పురుగులు పంటను ఆశించి నష్టం కలుగజేస్తాయన్నారు. ఈ ప్రాంతంలో పత్తిపంటను గులాబీ పురుగులు ఆశించినట్టు గుర్తించారు. వీటి నివారణకు ఎకరానికి ఎనిమిది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. యాజమాన్య పద్ధతులు చేపట్టి చీడపీడలను నివారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ బి.అశోక్‌కుమార్, ఏఈఓ పి.జగ్గఅప్పారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, వైద్య సిబ్బంది

అన్నవరం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ సూర్యప్రకాష్ తెలిపారు. రత్నగిరి దేవస్థానంలోని సత్యదేవ గోశాలలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సినేషన్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 18వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గ్రామాల్లోని పశువుల వద్దకు వెటర్నరీ సిబ్బంది వెళ్లి టీకాలు వేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం గోశాలలోని ఆవులకు గాలికుంటువ్యాధి సోకకుండా టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్లు నిర్మల కుమారి, మనోజ్‌కుమార్, వైద్యాధికారులు కాకర్ల ప్రసాద్, లావణ్య, దేవస్థానం సూపరింటిండెంట్ ఐవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



జె.కొత్తూరులో సారా బట్టీలపై దాడులు చేస్తున్న పోలీసులు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు శివారులో సారా బట్టీలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. సారా తయారు చేస్తున్న గూడపు వెంకటరమణ అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత

తొండంగి: మండలంలోని గోపాలపట్నం-తొండంగి రహదారిలో గుంతలు పూడ్చివేత పనులను అధికారులు చేపట్టారు. భారీ వాహనాల రాకపోకలు కారణంగా గోపాలపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి వద్ద, గ్రామ శివారుల్లో రోడ్డుపై భారీగా గుంతలు పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరగడంతో ఎట్టకేలకు అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. గుంతలు పడ్డ ప్రాంతంలో రోడ్డును పూర్తిగా తొలిచి కంకరతో ఫిల్లింగ్ చేస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో మరమ్మతుల పనులు పూర్తి కానున్నాయి. కత్తిపూడి నుంచి రావికంపాడు వెళ్లే రహదారిలో కూడా పలుచోట్ల గుంతలు పూడ్చేందుకు ఆర్ అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు.

సెల్‌ఫోన్‌లో లింక్ ఓపెన్ చేస్తే రూ.2.62 లక్షలు మాయం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరుకు చెందిన పుచ్చకాయల వెంకటరమణ అనే వ్యక్తి సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.2.62 లక్షలు పోగొట్టుకొన్నాడు. గండేపల్లి ఎస్సై శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... తాళ్లూరుకు చెందిన వెంకటరమణకు గుర్తు తెలియని నంబర్ నుంచి ఒక లింక్ వచ్చింది. దాన్ని ఓపెన్ చేసిన కొన్ని నిమిషాల్లోనే అతని బ్యాంకు అకౌంట్ నుంచి రూ.2.62 లక్షలు మాయమయ్యాయి. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు జగ్గంపేట సీఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

రెండు గ్రామాల్లో 16 మందికి గాయాలు

పిఠాపురం: పిఠాపురం మండలం భోగాపురం, పిఠాపురం శివారు ఏడుకాలువల గ్రామాల్లో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో 16 మందికి గాయాలయ్యాయి. రెండు గ్రామాల్లోనూ రెండు కుక్కలు విచక్షణారహితంగా దాడి చేయడంతో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో కొందరికి పిఠాపురం సీహెచ్‌సీలో వైద్య సేవలందించారు.

చెరువు కాదండోయ్..రహదారే!



ఏలేశ్వరంలో చెరువును తలపిస్తున్న రహదారి

ఏలేశ్వరం: మీరు చూస్తున్నది చెరువు అనుకుంటే పొరపాటు పడినట్టే. ఈ చిత్రంలో కనిపిస్తున్నది నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి. ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారులు చెరువులను తలపిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏలేశ్వరం పట్టణంలోని చైతన్యనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపునీరు నిల్వ ఉండడంతో చెరువులా మారింది. దీంతో పాటు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: కొద్ది రోజులుగా వేసవి తలపించే ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు బుధవారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు అల్లాడిపోయారు. దానికి తోడు పలు గ్రామాల్లో విద్యుత్ కోతలు విధించారు. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

జగ్గంపేట: అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలోని అనాథ ఆశ్రమంలో విద్యార్థుల మృతికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. జగ్గంపేటలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కైలాసపట్నం గ్రామంలోని పాసా అనాథ ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్ అయ్యి ముగ్గురు విద్యార్థులు చనిపోవడానికి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ నర్సీపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 21 మందికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు

కిర్లంపూడి: మండలంలోని గోనేడలో వేంచేసిన ఒరేలమ్మతల్లి జాతరను పురస్కరించుకుని బుధవారం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. మండలంలోని గోనేడ, మర్లావ, రామచంద్రపురం తదితర గ్రామాల నుంచి 12 ఎడ్లజతలు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కాతా శివాజీకి రూ.5 వేలు, మెమెంటో, రెండో బహుమతి సాధించిన కామన శ్రీనుకు రూ.3 వేలు, మూడో బహుమతి సాధించిన సూరిబాబుకు రూ.2 వేలు, షీల్డ్‌లు అందజేశారు.

ప్రైవేట్ హాస్టళ్లలో తనిఖీలు



పెదశంకర్లపూడిలో వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: మండలంలోని ప్రైవేటు వసతి గృహాలను బుధవారం జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనకాపల్లి జిల్లాలోని ప్రైవేటు వసతి గృహంలో ఇటీవల ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు మృతి చెందిన నేపథ్యంలో అధికారులు వసతి గృహాల తనిఖీ చేపట్టారు. ప్రత్తిపాడులోని ఆలంబన, పెదశంకర్లపూడి, శాంతిఆశ్రమం, చింతలూరు గ్రామాల్లో ప్రైవేట్ యాజమాన్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. పెదశంకర్లపూడిలోని ఓ చర్చిలో నిర్వహిస్తున్న వసతి గృహానికి ఎటువంటి అనుమతులు లేకపోవడం, పది మంది పిల్లలున్నప్పటికీ వారికి సరిపడు మరుగుదొడ్లు, వసతులు లేకుండా నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నిద్రించేందుకు కూడా సరిపడని గదిలో వసతిగృహం కొనసాగంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రభుత్వ హోమ్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఉన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం

- దుకాణాలు, విద్యాసంస్థలు మూసివేత
- డిపోకే పరిమితమైన బస్సులు
- నిలిచిపోయిన రాకపోకలు



ఏలేశ్వరంలో రాస్తారోకో చేస్తున్న దళిత నాయకులు

ఏలేశ్వరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన భారత్‌బంద్ ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఏలేశ్వరంలో ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. పట్టణంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. పట్టణంలో ప్రధాన రహదారులను ఆనుకుని దుకాణాలు మూసివేయడంతో రహదారులు వెలవెలబోయాయి. జైభీమ్ యువజన సంఘం, ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సిరిపురంలో దళితులు మోకాళ్ల నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కుప్పల నాగభూషణం, నూకతాటి సందీప్, బోండు వీరబాబు, బత్తిన శ్రీనివాస్, కోనాల వెంకటరమణ, కాకర వెంకట్రావు, ఉప్పటిలాజర్‌బాబు, గునుపూడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తుని: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ బుధవారం దళితులు చేపట్టిన భారత్ బంద్ తుని నియోజకవర్గంలో విజయవంతమైంది. తుని పట్టణంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ముందస్తు సమాచారం ఇవ్వడంతో పట్టణంలోని దుకాణాలు, విద్యాసంస్థలు, బ్యాంకులను స్వచ్ఛందంగా మూసివేశారు. వీరవరపుపేట, కొండవారిపేటకు చెందిన దళిత సంఘాల ప్రతినిధులు పట్టణంలో వర్గీకరణకు నిరసనగా నినాదాలు చేశారు.

రౌతులపూడి: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఆందోళనకారులు రౌతులపూడి ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. స్థానిక గిడజాం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఎస్సీ వర్గీకరణ వద్దు, ఐక్యతే ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

తుని రూరల్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళితులు బుధవారం నిర్వహించిన బంద్ తుని మండలంలో ప్రశాంతంగా జరిగింది. హంసవరం, ఎస్.చామవరంలో హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు చేసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. తేటగుంట, డి.పోలవరం, తదితర గ్రామాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు.

శంఖవరం: ఎస్సీ వర్గీకరణకు నిరసనగా జైభీమ్ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారత్ బంద్ ప్రశాతంగా జరిగింది. మండలంలోని కత్తిపూడి, శంఖవరం తదితర గ్రామాల్లో మాల మహానాడు నాయకులు దుకాణాలు, పాఠశాలలు, కార్యాలయాలను మూసి వేయించారు. కత్తిపూడిలో జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దువ్వాడ సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలపు సత్యనారాయణ, పెదపాటి ఆనంద్, బత్తిన తాతాజీ, సికోలు దుర్గాప్రసాద్, పులి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా బుధవారం చేపట్టి భారత్ బంద్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు మూతపడ్డాయి. రవాణా, వాణిజ్య, వర్తక, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపాయి.

ప్రత్తిపాడు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత సంఘాలు దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన భారత్ బంద్ ప్రభావం ప్రత్తిపాడు మండలంలో పెద్దగా కనిపించలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపార సంస్థలు యథావిధిగా పనిచేశాయి.

గోకవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఇచ్చిన పిలుపు మేరకు గోకవరం మండలంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ ప్రశాంతంగా జరిగింది. రాజకీయాలకు అతీతంగా మాల నాయకులు, ఉద్యోగ, విద్య, కార్మిక, స్వచ్ఛంద, వివిధ రంగాలకు చెందిన వారు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. తెల్లవారుజామున మూడు గంటలకే గోకవరం ఆర్టీసీ డిపోకు చేరుకుని ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు, బంకులు, వ్యాపార సంస్థలు మూతబడ్డాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో పర్యవేక్షించారు.

జగ్గంపేట/గండేపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో విజయవంతమైంది. జగ్గంపేటలో దళిత సంఘాల నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వద్దు- ఐక్యతే ముద్దు అంటూ నినాదాలు చేశారు. జగ్గంపేట, గండేపల్లి గ్రామాల్లోని దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఆందోళనకారులు మూసివేయించారు. కార్యక్రమంలో దళిత నేతలు పులి ప్రసాద్, జుత్తుక నాగేశ్వరరావు, వల్లూరి సత్యానందం పాల్గొన్నారు.

అన్నవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ అన్నవరం విజయవంతమైంది. వాణిజ్య బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను జేఏసీ నాయకులు మూసి వేయించారు.

తొండంగి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత సంఘాలు చేపట్టిన బంద్ మండలంలో విజయవంతమైంది. మాలమహానాడు నాయకులు తొండంగిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలను మూసివేశారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మూతపడ్డాయి. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు దడాల విజయ్, బుర్తి విక్టర్, అంగుళూరి సునీల, అంగుళూరి సుధాకర్, చిట్టిమూరి బాలు తదితరులు పాల్గొన్నారు.



కత్తిపూడిలో ర్యాలీ చేస్తున్న జైభీమ్ మాలమహానాడు నాయకులు



గోకవరంలో ఆర్టీసీ డిపో వద్ద బంద్ పాటిస్తున్న దళిత నాయకులు